- 4 AUG 2020

SAKSHI

# మెల్ల.. మెల్లగ వచ్చిందే..

- రెండు నెలల క్రితం వరకూ కరోనా రహితంగా యానాం
- ఒక్కసారిగా పెరిగిన కేసులు
- ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్న అధికారులు

యానాం: రెండు నెలల క్రితం వరకూ ఒక్క పాజిటివ్ కేసు కూడా నమోదు కాకుండా కరోనా రహిత ప్రాంతంగా ఉన్న యానాం నియోజకవర్గంలో ప్రస్తుతం కేసులు భారీగా నమోదవుతున్నాయి. గడచిన రెండు నెలల్లో ఏకంగా 261 పాజిటివ్ కేసులు నమోదు కావడం సర్వత్రా ఆందోళన కల్గిస్తోంది. స్వీయ క్రమశిక్షణ ద్వారానే కరోనా కట్టడి సాధ్యమని అధికారులు సూచిస్తున్నా ప్రజలు పట్టించుకోవడం లేదు. కేసులు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని, మాస్కులు ధరించాలని అధికారులు చెబుతున్నా కొందరు పెడచెవిన పెట్టడంతోనే కేసులు పెరుగుతున్నాయనే వాదనలు ఉన్నాయి. నియోజకవర్గ పరిధిలో ఇప్పటి వరకూ 2200 మందికి కరోనా పరీక్షలు నిర్వహించగా 262 మందికి పాజిటివ్ వచ్చిదన్నారు.

**అరవై రోజుల క్రితం వరకూ ఒక్క కరోనా కేసు కూడా నమోదు కాని యానాంలో ఇప్పుడు మహమ్మారి విజృంభిస్తోంది. రోజు రోజుకూ పాజిటివ్ కేసులు పెరగడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. రెండు నెలల వ్యవధిలో సుమారు 261 పాజిటివ్ కేసులు నమోదయ్యాయి.**



వైఎస్సార్ ఇండోర్ స్టేడియం వద్ద కోవిడ్-19 పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

### మొబైల్ వాహనంలో పరీక్షలు

కరోనా పరీక్షలను వేగవంతం చేసేలా సోమవారం నుంచి స్థానిక వైఎస్సార్ స్టేడియం వద్ద, మార్కెట్ సెంటర్, కనకాలపేట గ్రామాల్లో మొబైల్ వ్యాన్ ద్వారా శాంపిల్స్‌ను సేకరిస్తామని అధికారులు తెలిపారు.

### మెరుగ్గా రికవరీ రేటు

యానాంలో కరోనా వైరస్ బారిన పడి కోలుకున్న వారి సంఖ్య కూడా ఎక్కువగానే ఉంది. ఇప్పటికే 93 మంది చికిత్స పొంది డిశ్చార్జ్ అయ్యారు. ఇంకా 166 మంది యానాం జీజీహెచ్, మెట్టకూరు కోవిడ్ ఆసుపత్రిలోనూ చికిత్స పొందుతున్నారు. అదే విధంగా మహాత్మాగాంధీ ప్రభుత్వ హైస్కూల్‌ను సైతం కోవిడ్ ఆసుపత్రిగా తీర్చిదిద్దుతున్నారు.

### ప్రైమరీ కాంటాక్ట్‌లతోనే..

యానాంలో దాదాపు 70 శాతం ప్రైమరీ కాంటాక్ట్‌ల ద్వారానే కరోనా సోకిందని, ఈ నేపథ్యంలో ప్రతిఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని అధికారులు సూచిస్తున్నారు. ప్రజలు శానిటైజర్ వినియోగించాలని, మాస్కులు ధరించాలని, భౌతిక దూరం పాటించాలని అధికారులు ప్రచారం చేస్తున్నారు.

## పౌష్టికాహారంపై కరోనా బాధితుల హర్షం



చికెన్ కర్రీతో బాధితులకు ఇస్తున్న మధ్యాహ్న భోజనం

యానాం: కరోనా బారిన పడి యానాం జీజీహెచ్, మెట్టకూరు హైస్కూల్‌లోని కోవిడ్ కేర్ సెంటర్‌లో చికిత్స పొందుతున్న బాధితులకు రోజువారీ మెనూలో వివిధ ఆహార పదార్థాలను పంపిణీ చేయడంపై సోమవారం పలువురు బాధితులు హర్షం వ్యక్తం చేశారు. ప్రతిరోజూ ఉదయం అల్పాహారంగా రెండు కోడిగుడ్లు, ఇడ్లీ, వడ, ఓ ఫలాన్ని అందిస్తున్నారు. మధ్యాహ్నం భోజనం కింద వెజ్ పలావుతో పాటు అన్నం, ఓల్డేజ్ హోమ్ వారు అందించే చికెన్ కర్రీ, అరటిపండు, కొన్ని రకాల కూరలను పంపిణీ చేస్తున్నారని బాధితులు చెప్పారు. బాధితులంతా త్వరగా కోలుకోవాలనే ఉద్దేశంతో ఈ ఏర్పాట్లు చేసినట్లు వైద్యులు తెలిపారు.

## ఓఎన్జీసీ వాహనాలను అడ్డుకున్న మత్స్యకారులు

యానాం: కేజీ బేసిన్‌లో చమురు సంస్థలు చేపడుతున్న కార్యకలాపాలతో నష్టపోతున్న మత్స్యకారులకు వేట నష్ట పరిహారం చెల్లించే వరకూ ఆ సంస్థల కార్యకలాపాలను అడ్డుకుంటామంటూ సోమవారం మత్స్యకార సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. యానాం ముఖ ద్వారం వద్ద ఓఎన్జీసీ సంస్థకు చెందిన వాహనాలను, యంత్ర సామగ్రి వెళ్లకుండా అడ్డుకున్నారు. తమకు గతంలో చెల్లించాల్సిన వేట నష్టపరిహారం ఏళ్లు గడుస్తున్నా చెల్లించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే పరిహారం చెల్లించాలని కోరారు.

ENADU

4 AUG 2020

**యానాం:** పుదుచ్చేరి పాలనా సంస్కరణల విభాగం 22 స్టెనోగ్రాఫర్ గ్రేడ్-2 పోస్టుల భర్తీకి ప్రకటన జారీ చేసింది. ఈ నెలాఖరు నాటికి 32 ఏళ్లలోపు వయసుగల జనరల్, రిజర్వుడు కేటగిరీల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని అండర్ సెక్రటరి వి.జయశంకర్ తెలిపారు. 2016, 18 సంవత్సరాలలో స్టెనోగ్రాఫర్ పోస్టులకు దరఖాస్తు చేసిన అభ్యర్థులు కొత్తగా దరఖాస్తు చేయాల్సిన అవసరం లేదన్నారు.

**యానాం:** యానాంలో కరోనా వైరస్ గురించి ప్రజల్లో తగు అవగాహన కల్పించి, వ్యాపార విక్రయ వేళలు మార్పు చేయాలని ప్రభుత్వం యోచిస్తున్నట్లు మంత్రి మల్లాడి కృష్ణారావు పేర్కొన్నారు. ప్రస్తుతం ఉదయం 6 నుంచి 1 గంట వరకు ఉన్న విక్రయ వేళలను రాత్రి ఎనిమిది వరకు పెంచే అంశం గురించి సీఎం వి.నారాయణసామితో మాట్లాడి నిర్ణయం తీసుకుంటామన్నారు.

ANDHRA JYOTHI

4 AUG 2020

**యానాం:** పుదుచ్చేరి రాష్ట్రవ్యాప్తంగా సోమవారం 173 కేసులు నమోదయ్యాయని ఆరోగ్య శాఖ మంత్రి మల్లాడి కృష్ణారావు తెలిపారు. 102 మంది డిశ్చార్జ్ కాగా 1,515కేసులు యాక్టివ్‌లో ఉన్నాయన్నారు.